క్లుప్తంగా

వేలం వాయిదా

గుంతకల్లుటౌన్: పట్టణంలో దిన, వారపు మార్కెట్, మాంసపు దుకాణాలు, జంతు వధ శాలల నుంచి సుంకం వసూలు చేసుకునే హక్కును లీజుకు ఇవ్వడానికి శనివారం జరగాల్సిన బహిరంగ వేలం అనివార్య కారణాల వల్ల వాయిదా వేసినట్లు మున్సిపల్ కమిషనర్ నయీమ్ అహ్మద్ తెలిపారు. ఈ నెల 17న ఉదయం 10:30 గంటలకు వేలం నిర్వహిస్తామన్నారు.

అంగన్‌వాడీ కేంద్రం తనిఖీ



రికార్డులను పరిశీలిస్తున్న ఏసీడీపీఓ నాగమణి

గుత్తి: గుత్తి ఆర్‌ఎస్‌లోని పద్మనాభయ్య ఫ్యాక్టరీ అంగన్‌వాడీ కేంద్రాన్ని శనివారం ఏసీడీపీఓ నాగమణి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె రికార్డులు పరిశీలించారు. పౌష్టికాహార పంపిణీపై ఆరా తీశారు. సమయపాలన పాటించాలని సిబ్బందికి సూచించారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు అంగన్‌వాడీ కేంద్రాలను తెరిచి ఉంచాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సజావుగా గ్రామసభలు

యల్లనూరు: మండలంలోని కల్లూరు, చిలమకూరు, చింతకాయమంద పంచాయతీల్లో శనివారం గ్రామసభలు నిర్వహించారు. ఉపాధి హామీ పథకంలో ఎన్ని రోజులు కూలీలకు పనులు కల్పించారు? ఎంత నిధులు డ్రా చేశారు? అనే వాటిపై సభలు సాగాయి. ఈ సందర్భంగా అధికారులు క్షేత్రస్థాయిలో తిరిగి నివేదికలను తయారు చేసి గ్రామసభలో కూలీలకు చదివి వినిపించారు. ఏవైనా సమస్యలు ఉంటే గ్రామసభలో తెలిపాలని డీఆర్పీలు తెలిపారు. కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్లు వెంకట్రామిరెడ్డి, వీరభూషణ, జనార్దన్‌నాయుడు, రాజశేఖర్, మల్లారెడ్డి , డీఆర్పీలు సంజన్న, రమణనాయక్, మార్క్ తదితరులు పాల్గొన్నారు.

ఆగ్రో ఫారెస్ట్‌పై అవగాహన



మాట్లాడుతున్న సీఈఓ నారాయణ స్వామి

గుత్తి: పట్టణంలోని అనంతపురం రోడ్డులో ఉనన విరూపాక్షి రెడ్డి కల్యాణ మండపంలో శనివారం హ్యాండ్స్ సంస్థ ఆధ్వర్యంలో శనివారం ఆగ్రో ఫారెస్ట్‌పై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. హ్యాండ్స్ మేనేజర్ రమేష్ యాదవ్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సీఈఓ నారాయణ స్వామి మాట్లాడారు. 2024–25లో ఆగ్రో ఫారెస్ట్ కార్యక్రమం విజయవంతమైందన్నారు. రైతులు సాగు చేసి వివిధ రకాల పండ్ల మొక్కలను అడవి జంతువుల దాడి నుంచి కాపాడటానికి బయో ఫెన్సింగ్ విధానాన్ని ఉపయోగించాలన్నారు. రైతులు పంటలు సాగు చేయడంతో పాటు వాటిని సంరక్షించుకోవడం కూడా ముఖ్యమేనన్నారు. కార్యక్రమంలో పెంచల్ కుమార్, మహబూబ్ వలి, మనోహర్, నారాయణస్వామి, శివ తదితరులు పాల్గొన్నారు.

ఏపీఓ బదిలీ

యల్లనూరు: ఎంపీడీఓ కార్యాలయంలో ఉపాధి హామీ పథకం ఏపీఓగా విధులు నిర్వహిస్తున్న షబ్బీర్‌బాషా వైఎస్సార్ జిల్లా పులివెందుల నియోజకవర్గం చక్రాయపేట మండలానికి బదిలీ అయ్యారు. కాగా యల్లనూరు ఏపీఓగా ఎవ్వరిని ఇంకా నియమించలేదు.

ఘనంగా టెక్ మహోత్సవ్



మాట్లాడుతున్న
టెక్ కళాశాలల చైర్మన్ రమేష్‌రెడ్డి

తాడిపత్రి: పట్టణంలోని తాడిపత్రి ఇంజినీరింగ్ కళాశాలలో శుక్రవారం రాత్రి టెక్ మహోత్సవ్ ఘనంగా నిర్వహించారు. టెక్ ఇంజినీరింగ్ కళాశాల 15వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా టెక్ ఇన్స్టిట్యూషన్స్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి రమేష్‌రెడ్డి హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ, కళాశాలలో విద్యార్థులకు నాణ్యమైన బోధన అందించేందుకు నైపుణ్యం కలిగిన సిబ్బంది ఉన్నారన్నారు. విద్యార్థులు నైపుణ్యాలను పెంపొందించుకోవడం ద్వారా ఉన్నతస్థాయికి చేరుకుంటారన్నారు. కళాశాల సెక్రటరీ సురేష్‌రెడ్డి మాట్లాడుతూ ఈ ఏడాది కళాశాలకు అటానమస్ గుర్తింపు లభించిందని, అందుకు కృషి చేసిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం కళాశాలలో 10 సంవత్సరాలుగా పని చేస్తున్న బోధన సిబ్బందిని కళాశాలల చైర్మన్, సెక్రటరీ సత్కరించారు. అలాగే ఉత్తమ ప్రతిభ కనబరచిన విద్యార్థులు ఉపాధ్యాయులకు ప్రోత్సాహక బహుమతులుఅందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఆటపాటలతో అలరించారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ ఆర్.అశోక్‌రెడ్డి, డైరెక్టర్ నటరాజేశ్వర్‌రెడ్డి, ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్, బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

పది పరీక్షలకు సర్వం సిద్ధం

పదో తరగతి పబ్లిక్ పరీక్షలు 17వ తేదీ నుంచి ప్రారంభం కానున్నాయి. ఇప్పటికే పరీక్షల ప్రశ్న పత్రాలు ఆయా మండలాల పోలీస్‌స్టేషన్లకు చేరగా ప్రత్యేక గదుల్లో అధికారులు భద్రపరిచారు. ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.45 గంటలకు పరీక్షలు నిర్వహిస్తారు. పరీక్ష కేంద్రానికి అరగంట ముందే విద్యార్థులు చేరుకోవాలని ఎంఈఓలు సూచిస్తున్నారు.

- రేపటి నుంచి పరీక్షలు
- అధికారుల ఏర్పాట్లు



పదో తరగతి విద్యార్థులకు సూచనలిస్తున్న దృశ్యం

తాడిపత్రి రూరల్: పదో తరగతి పరీక్షల నిర్వహణకు అధికారులు సర్వం సిద్ధం చేశారు. పదో తరగతి పరీక్షలు ఈ నెల 17న ప్రారంభమై 31వ తేదీ వరకూ నిర్వహించనున్నారు. ప్రతి పాఠశాల్లో విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణతను సాధించేందుకు ఉపాధ్యాయులు కృషి చేస్తున్నారు. తాడిపత్రి నియోజక వర్గంలో 4,145 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నారు. పరీక్షల నిర్వహణ కోసం తాడిపత్రి పట్టణంలో ఏర్పాటు చేసిన 10 కేంద్రాల్లో 150 మంది ఇన్విజిలేటర్లను నియమించారు. చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్‌మెంట్ ఆధికారులు, ఆయా రూట్లల్లో ఫ్లయింగ్ స్క్వాడ్‌లను ఏర్పాటు చేశారు. ప్రతి పరీక్ష కేంద్రానికి ఒక సీఎస్, డీఓలను నియమించారు. 240మంది విద్యార్థులకు మించి ఉన్న కేంద్రానికి అదనంగా డీఓను ఏర్పాటు చేశారు.

ప్రథమ చికిత్స కేంద్రాలు ఏర్పాటు..

పరీక్ష కేంద్రాల్లో విద్యార్థులు అస్వస్థతకు గురైతే వారికి ప్రథమ చికిత్స అందించేందుకు కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఒక్కో పరీక్ష కేంద్రంలో సీహెచ్‌సీలు, అర్బన్ హెల్త్ సెంటర్లలో పనిచేస్తున్న ఏఎన్‌ఎంలు, అశా వర్కర్లు, ఇతర సిబ్బందిని వైద్య శాఖ నియమించనుంది. ప్రథమ చికిత్స కోసం అవసరమైన మందులు, ఓఆర్‌ఎస్ ప్యాకెట్లును అందుబాటులో ఉంచనున్నారు. పరీక్షల కేంద్రాల వద్ద వైద్య సిబ్బందితో పాటు ఇన్విజిలేటర్లు తదితరులకు సెల్‌ఫోన్ సౌకర్యాన్ని నిషేధించారు. పరీక్ష కేంద్రాల నుంచి 200 మీటర్ల వరకు 144 సెక్షన్ విధించి పోలీసు బందోబస్తును ఏర్పాటు చేయనున్నారు. పరీక్షలు పగడ్బందిగా నిర్వహించేందుకు మునిసిపాలిటీ, విద్యుత్‌శాఖ, పంచాయతీరాజ్, ఆర్టీసీ ఆధికారులతో విద్యాశాఖ అధికారులు సమావేశమై సహకరించాల్సిందిగా కోరారు.

తాడిపత్రి నియోజకవర్గంలో ఇలా..		
మండలం	విద్యార్థుల సంఖ్య	సెంటర్లు
తాడిపత్రి	2,524	10
పెద్దపప్పూరు	397	2
పెద్దవడుగూరు	882	2
యాడికి	742	3

పోలీసు స్టేషన్లలో ప్రశ్న పత్రాలు..

పదో తరగతి పరీక్ష పత్రాలు ఇప్పటికే ఆయా పోలీసు స్టేషన్లకు చేరాయి. ఈ నెల11, 12 తేదీల్లో జిల్లా కేంద్రం చేరుకోగా అక్కడి నుంచి పరీక్ష కేంద్రాలకు సమీపంలోని పోలీసు స్టేషన్‌కు అధికారులు తరలించారు. సెట్ -1, సెట్-2 పరీక్ష ప్రశ్న పత్రాలను పోలీసు స్టేషన్లలో సీఎస్, డీఓలు సబ్జెక్టుల వారికి వేరుచేసి తేదీల వారిగా విభజించి భద్రపరిచారు. సమస్యాత్మక పరీక్ష కేంద్రాల వద్ద అదనపు పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయనున్నారు. ఈ క్రమంలో విద్యార్థుల కోసం విద్యాశాఖ కొన్ని మార్గదర్శకాలను జారీ చేసింది. పరీక్ష రోజు ఉదయం 8.30 గంటలకు పరీక్ష కేంద్రం వద్ద ఉండాలని, ఉదయం 8.45 నుంచి 9.30గంటల వరకు పరీక్ష కేంద్రంలోని అనుమతి ఉంటుందన్నారు.

కష్టపడి చదివాను



పరీక్షల కోసం కష్టపడి చదివాను. ఉపాధ్యాయులు కూడా శ్రమించి మమ్మల్ని పరీక్షల కోసం సన్నద్ధం చేశారు. స్టడీ మెటీరియల్ ఇవ్వడంతో పాటు ఇంపార్టెంట్ ప్రశ్నలను చెప్పడమేకాకుండా, ఎప్పటికప్పుడు పాఠాల్లోని అనుమానాలను నివృత్తి చేశారు. పరీక్షల్లో మంచి మార్కులు సాధిస్తాను.

– యుగంధర్‌రెడ్డి, విద్యార్థి

వందశాతం ఉత్తీర్ణతకు కృషి



పదో తరగతిలో వంద శాతం ఉత్తీర్ణత సాధిస్తాం. విద్యార్థులకు అదనపు క్లాస్‌లను తీసుకుని మరీ తీర్చిదిద్దాం. ముఖ్యమైన పాఠాలపై ప్రత్యేక దృష్టి పెట్టి చదివించాం. చదువులో వెనుకబడిన విద్యార్థులు కూడా పాసు అయ్యేవిధంగా చర్యలు తీసుకున్నాం.

– మురళీ క్రిష్ణ, ఇన్‌చార్జ్ హెచ్‌ఎం, చుక్కలూరు హైస్కూల్

ఏర్పాట్లు పూర్తి



పదో తరగతి పబ్లిక్ పరీక్షల నిర్వహణ కోసం ఏర్పాటు పూర్తి చేశాం. విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూడాలని ఇన్విజిలేటర్లను ఆదేశించాం. వేసవిని దృష్టిలో ఉంచుకొని నీటి సౌకర్యం కల్పించాం. ఆయా శాఖ అధికారులతో సమావేశమై పరీక్షల నిర్వహణకు సహకరించాలని కోరాం.

– నాగరాజు, ఎంఈఓ, తాడిపత్రి

ప్లాస్టిక్ విక్రయిస్తే దుకాణం సీజ్



గుత్తిలో ర్యాలీ నిర్వహిస్తున్న
గేట్స్ పాలిటెక్నిక్ కాలేజీ విద్యార్థులు

గుత్తి/గార్లదిన్నె/పామిడి/పెద్దవడుగూరు: గుత్తి మున్సిపాలిటీ పరిధిలో ప్లాస్టిక్ విక్రయాలు చేస్తే కేసులు నమోదు చేయడంతో పాటు దుకాణం సీజ్ చేస్తామని మున్సిపల్ కమిషనర్ జబ్బార్‌మియా హెచ్చరించారు. మున్సిపల్, సచివాలయ సిబ్బందితో పాటు గేట్స్ పాలిటెక్నిక్ కాలేజీ విద్యార్థులతో కలసి శనివారం స్వచ్ఛాంధ్ర- స్వచ్ఛ దివస్ కార్యక్రమం నిర్వహించారు. ప్లాస్టిక్ నిషేధంపై గుత్తి పట్టణంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. షాపులు, హోటళ్లతో తనిఖీలు నిర్వహించారు. ప్లాస్టిక్ విక్రయిస్తున్న వారికి జరిమానా విధించారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ మహబూబ్ బాషా, మెప్మా కో–ఆర్డినేటర్ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు. అలాగే గుత్తి ఆర్‌ఎస్‌లోని పద్మనాభయ్య ఫ్యాక్టరీ అంగన్‌వాడీ సూపర్ వైజర్ నాగేశ్వరి, కార్యకర్త నాగలక్ష్మి, విద్యార్థుల తల్లులతో కలిసి ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఏసీడీపీఓ నాగమణి మాట్లాడారు. అలాగే గార్లదిన్నె మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో స్వర్ణాంధ్ర , స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా పంచాయతీ సిబ్బంది ప్లాస్టిక్ నిషేధంపై ర్యాలీ చేశారు. ఎంపీడీఓ యోగానందరెడ్డి, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు. అలాగే పామిడిలో స్వచ్ఛాంధ్రపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఎంపీడీఓ తేజోత్స్న, ఎంఈఓ గోపాల్, గుత్తి మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ కత్రిమల ప్రభాకర్‌చౌదరి, మాజీ ఎంపీటీసీ బొల్లు శ్రీనివాసరెడ్డి, పంచాయతీ, సచివాలయాల సిబ్బంది. పారిశుద్ధ్య కార్మికులు తదితరులు పాల్గొన్నారు. పెద్దవడుగూరులోని పంచాయతీ కార్యాలయం వద్ద స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీఓ బాలెన్‌సాహెబ్, ఈఓఆర్‌డీ నరసింహారెడ్డి , సర్పంచు వరలక్ష్మి, పంచాయితీ కార్యదర్శులు పాల్గొన్నారు

అంగన్‌వాడీ సెంటర్లను శుభ్రంగా ఉంచుకోవాలి

తాడిపత్రి రూరల్: అంగన్‌వాడీ కేంద్రాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూపర్‌వైజర్ దస్తగిరిమ్మ సూచించారు. శనివారం స్వచ్ఛాంధ్ర, స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని సీపీఐ కాలనీ-3లోని అంగన్‌వాడీ కేంద్రంలో పలు కార్యక్రమాలు నిర్వహించారు.

పట్టణాభివృద్ధికి సహకరించండి



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న
మున్సిపల్ చైర్‌పర్సన్ భవాని

గుంతకల్లుటౌన్: పట్టణంలో అభివృద్ధి పనులు చేసిన కాంట్రాక్టర్లకు సకాలంలో బిల్లులు చెల్లించేందుకు వీల్లేకుండా ప్రీ ఆడిట్ అధికారులు అన్నింటికీ కొర్రీలు వేస్తున్నారు. కొత్తగా పనులు చేయాలంటే కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదు. దీంతో గుంతకల్లులో అభివృద్ధికి కుంటుపడుతోందని, తక్షణమే సమస్య పరిష్కారానికి తగు చర్యలు చేపట్టాలని కలెక్టర్ వినోద్‌కుమార్‌ను మున్సిపల్ చైర్‌పర్సన్ భవాని కోరారు. శనివారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. పట్టణంలో పారిశుధ్యం అధ్వానంగా ఉందని, పెరిగిన జనాభా, విస్తీర్ణాన్ని దృష్టిలో ఉంచుకుని కార్మికుల సంఖ్యను పెంచాలని కోరారు. శివారు కాలనీల్లో తాగునీటి పైప్‌లైన్ ఏర్పాటు, ఇతర అభివృద్ధి కార్యక్రమాలకు నిధులివ్వాలన్నారు. ఇందుకు కలెక్టర్ స్పందిస్తూ ప్రీ ఆడిట్ అధికారులతో చర్చించి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. పట్టణంలో పారిశుద్ధ్యాన్ని మెరుగుపరిచేందుకు అవసరమైతే తాత్కాలిక పద్ధతిన పీహెచ్ వర్కర్ల సంఖ్య పెంచుకునేందుకు అనుమతిస్తున్నట్లు ప్రకటించారు. పట్టణాభివృద్ధికి నిధుల సమస్య ఉన్నట్లయితే కౌన్సిల్‌లో తీర్మానం చేసి తనకు పంపాలని, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శితో చర్చించి నిధులు విడుదల చేయిస్తానని కలెక్టర్ హామీ ఇచ్చారు. టీడీపీ నాయకుడు నారాయణస్వామి మాట్లాడుతూ ఇంటింటా చెత్తసేకరణ ఆటోడ్రైవర్లకు జీతాలు చెల్లించే పాత ఏజెన్సీని రద్దు చేసి ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలని కోరారు. అలాగే మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ, ఏఐటీయూసీ నాయకులు కె.నరసయ్య, జగదీష్, జె.నరసయ్య, చిన్నయ్య తదితరులు కోరారు. ప్రభుత్వ కార్యక్రమాల్లో ఏర్పాటు చేసే ఫ్లెక్సీల్లో ప్రధాని మోదీ ఫోటోను ఏర్పాటు చేయాలని, ఆక్రమణల పేరిట మందిరాలను కూల్చివేయడం తగదని బీజేపీ పట్టణ అధ్యక్షుడు వడ్డేరమేష్, కొలిమి రామాంజి కోరారు. అనంతరం ఆస్పత్రి ఏఓ రామ్ ప్రసాద్‌పై చర్యలు తీసుకోవాలని ఎమ్మార్పీఎస్ నాయకుడు భీమలింగ కలెక్టర్‌కు వినతిపత్రాన్ని అందజేశారు.

‘ఉపాధి హామీ’ బిల్లులు చెల్లించండి



గుత్తి మండలం మామిళ్లచెరువులో
ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న నాయకులు

గుత్తి రూరల్/పెద్దవడుగూరు: ఉపాధి కూలీలకు పెండింగ్ బిల్లులు చెల్లించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి వి.నిర్మల డిమాండ్ చేశారు. వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో స్కూటర్ యాత్ర శనివారం గుత్తి మండలంలోని మామిళ్లచెరువు గ్రామంలో నిర్వహించి ఉపాధి కూలీల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆమె మాట్లాడుతూ ఉపాధి పనులు చేసిన కూలీలకు ఎనిమిది వారాలుగా కూలీలు చెల్లించలేదన్నారు. పనులు జరిగే ప్రదేశంలో కూలీలకు సరైన వసతులు కల్పించలేదన్నారు. ఉపాధి కూలీల సమస్యలను పరిష్కరించని పక్షంలో గ్రామాల్లోని సచివాలయాల ఎదుట ఈ నెల 20, 21న పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల నాయకులు వెంకటలక్ష్మి, రంజిత్‌నాయక్ పాల్గొన్నారు. అలాగే పెద్దవడుగూరు మండలంలోని చిన్నవడుగూరు, పెద్దవడుగూరు గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి పనులను ఏపీ రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి దస్తగిరి పరిశీలించారు. కూలీల సమస్యలను పరిష్కరించక పోతే పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాసులు, కూలీలు పాల్గొన్నారు.

కనుల పండువగా ఓబులేసుస్వామి ఉత్సవం



ఎద్దుల బండిపై
ఊరేగింపుగా వస్తున్న ఓబులేసు స్వామి



రాతిదూలం లాగుడు పోటీలు
నిర్వహిస్తున్న దృశ్యం

యల్లనూరు: బొప్పేపల్లి కొండకొనల్లో వెలసిన ఓబులేసు స్వామి ఉత్సవం శనివారం కనుల పండువగా నిర్వహించారు. ఉదయం నుంచి స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. యల్లనూరు వాల్మీకులకు అత్యంత ప్రధానమైన పండుగ ఇదే. యల్లనూరు నరసింహాస్వామి గుడి నుంచి ఓబులేసు స్వామి ఉత్సవ విగ్రహాన్ని శనగల వంశీకుల ఎద్దుల బండిపై ఊరేగిస్తూ ఓబులేసుని కోనకు తీసుకెళ్లారు. విగ్రహానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. రాత్రి 7గంటలకు డీజే కట్టెల కోలాటం నిర్వహించారు. ఆదివారం యల్లనూరుకు విగ్రహాన్ని తిరిగి తీసుకొని వచ్చి పెద్దమ్మ గుడిలో జంతువులను బలిదానం చేస్తారు.

ఉత్కంఠగా రాతిదూలం పోటీలు

బొప్పేపల్లి ఓబులేసునిస్వామి తిరునాలసందర్భంగా కమిటీ సభ్యులు మన్నెల ఓబులేసు, చిన్నరాముడు, రామాంజినేయులు, చిన్న ఓబులేసుల ఆధ్వర్యంలో రాతిదూలం లాగుడు పోటీలను నిర్వహించారు. మన్నెల ఓబులేసు మొదటి బహుమతి రూ. 50వేలు, మన్నెల పెద్దరాముడు కుమారుడు ఓబులేసు, బాబు రెండో బహుమతి రూ.40 వేలు, మన్నెల రామాంజినేయులు మూడో బహుమతి రూ.30 వేలు , మన్నెల చిన్నరాముడు నాల్గో బహుమతి రూ.20 వేలు, మన్నెల యల్లప్ప కుమారుడు ప్రతాప్ ఐదో బహుమతి రూ.10 వేలు, రామలింగయ్యపల్లె చిన్న ఆంజనేయులు ఆరో బహుమతి రూ.5 వేలు గెలిచిన వృషభాల యజమానులకు ప్రదానం చేశారు.

రోడ్డు ప్రమాదంలో ఆశా వర్కర్‌కు గాయాలు

శింగనమల: శింగనమల పంచాయతీకి చెందిన ఆశా వర్కర్ పద్మావతి రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డారు. వివరాలు.. శింగనమల ఆరోగ్య ఉపకేంద్రం మేల్ ఎంపీహెచ్‌ఓ లేకపోవడంతో, ప్రతిసారీ ఆశా వర్కర్లు సలకంచెరువు ఆరోగ్య ఉపకేంద్రానికి వెళ్లి వ్యాక్సిన్ తీసుకువస్తుంటారు. అందులో భాగంగా ఆమె కుమారుడితో కలసి ద్విచక్రవాహనంలో సలకంచెరువు ఆరోగ్య ఉపకేంద్రంలో వ్యాక్సిన్ తీసుకునేందుకు వెళ్లారు. బైక్‌లో తిరిగి వస్తుండగా జారి కింద పడి ఆమె తలకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే స్థానిక సీహెచ్‌సీకి తరలించి, మెరుగైన వైద్యం కోసం అనంతపురం సర్వజనాస్పత్రికి తరలించారు.

మెటీరియల్ వితరణ



పెరవలి హైస్కూల్‌కు మెటీరియల్ అందజేస్తున్న దృశ్యం

శింగనమల: మండలంలోని పెరవలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదివిన పూర్వ విద్యార్థి, కెనరా బ్యాంక్ రీజనల్ మేనేజర్ మధుసూదన్‌రెడ్డి రూ.85 వేలు విలువ చేసే మెటీరియల్‌ను శనివారం పాఠశాలకు వితరణ చేశారు. పాఠశాలకు సైన్స్ ల్యాబ్, మ్యాథ్స్ ల్యాబ్‌కు మెటీరియల్, 30 జతల క్రీడా దుస్తులు అందజేశారు. పూర్వ విద్యార్థులు శ్రీకాంత్‌రెడ్డి, దామోదర్ నాయుడు, సర్పంచ్ రాజు, వరద రాజులు, నాగేశ్వర్‌రెడ్డి, కెనరా బ్యాంక్ మేనేజర్ రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

పరీక్ష కేంద్రాల పరిశీలన

పెద్దవడుగూరు: మండల కేంద్రంలోని పదో తరగతి పరీక్ష కేంద్రాలను ఎంఈఓ–2 గురుప్రసాద్ శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు కల్పించాల్సిన మౌలిక వసతులను గురించి ఆరా తీశారు. పరీక్షా కేంద్రాల్లో వెలుతురు బాగా ఉండేలా చూడాలని ప్రధానోపాధ్యాయులకు సూచించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా సరస్వతి పూజ

గుత్తి: పట్టణంలోని కోట వీధిలో ఉన్న జెడ్పీ ఉన్నత పాఠశాలలో శనివారం హెచ్‌ఎం సుభహాన్ ఆధ్వర్యంలో విద్యార్థులు సరస్వతీ పూజ నిర్వహించారు. వేద పండితుడు వాసుదేవశర్మ పూజలు చేశారు. పదో తరగతి విద్యార్థులు పరీక్షలు బాగా రాసి మంచి మార్కులు సాధించాలని హెచ్‌ఎం సూచించారు. జెడ్పీ పాఠశాలలో 216 మంది రెగ్యులర్ విద్యార్థులు, 16 మంది కంపార్ట్‌మెంట్ విద్యార్థులు, సరస్వతి హైస్కూల్‌లో 250 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కావాల్సి ఉందన్నారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బత్తాయి పండ్ల పంపిణీ

గార్లదిన్నె: మండలంలోని పాత కల్లూరు ప్రాథమిక పాఠశాలలో 63 మంది విద్యార్థులకు శనివారం హెచ్‌ఎం నరసింహులు బత్తాయి పండ్లు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఎండలకు నీరసం చెంది ఇబ్బందులు పడకుండా ఏటా సోమ, బుధ, శుక్రవారం వేసవి సెలవుల వరకూ బత్తాయి పండ్లు పంపిణీ చేస్తున్నానన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా యాదుల్లా బాషా షంషీర్



షంషీర్‌ను గుర్రంపై ఉంచి
దర్గాలోకి తీసుకెళ్తున్న దృశ్యం

గుత్తి రూరల్: మండలంలోని కొత్తపేట(కొత్తూరు)లో ఉన్న చెరువు కట్టపై వెలసిన యాదుల్లా బాషా ఖాద్రీ ఉరుసులో భాగంగా శనివారం షంషీర్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. షంషీర్‌ను గ్రామంలో నుంచి చెరువు కట్ట వరకూ ఊరేగించి దర్గాలో సమర్పించారు. జిల్లా నుంచే కాక ఇతర జిల్లాలు, కర్ణాటక నుంచి అధిక సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. భక్తులు దర్గాలో భక్తులు చక్కెర చదివించడంతోపాటు మొక్కుబడి ఉన్నవారు చాదర్ సమర్పించారు. దర్గా వద్ద పలు సాంస్కృతిక కార్యక్రమాలు, పాటల కచేరీలను ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ గురుమస్తాన్, వైస్ ఎంపీపీ తిరుపాలమ్మ, వైసీపీ బీసీ సెల్ నాయకుడు రాముయాదవ్, మాజీ సర్పంచ్ మాబుసాహెబ్ పాల్గొన్నారు.

వాటర్ ప్లాంట్ ప్రారంభం



వాటర్ ప్లాంట్ ప్రారంభిస్తున్న
జెడ్పీ మాజీ సభ్యుడు చితంబరరెడ్డి

పెద్దవడుగూరు: మండలంలోని మేడిమాకులపల్లిలో శనివారం మినరల్ వాటర్ ప్లాంటు ను వైఎస్సార్‌సీపీ నాయకుడు, జెడ్పీ మాజీ సభ్యుడు చితంబరరెడ్డి ఆధ్వర్యంలో గుత్తిఅనంతపురం గ్రామానికి చెందిన ఎన్‌ఆర్‌ఐ శేషారెడ్డి ప్రారంభోత్సవం చేశారు. అలాగే గుత్తి అనంతపురం సుంకులమ్మ దేవాలయం వద్ద రూ.30 లక్షల వ్యయంతో నిర్మించిన కమ్యూనిటీ హాలు ప్రారంభించారు. కార్యక్రమంలో గుత్తి అనంతపురం సర్పంచు మురళి , సీపీఐ నాయకుడు సూర్యనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

ముగిసిన ఇంటర్ పరీక్షలు

పామిడి: సీనియర్ ఇంటర్ పరీక్షలు శనివారం ప్రశాంతంగా ముగిసాయి. పామిడి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చివరిరోజు 262 మంది విద్యార్థులకు గాను 259 మంది పరీక్షలు రాశారు. పరీక్షలకు చీఫ్‌గా కృష్ణకుమార్, డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్‌గా రమేష్ వ్యవహరించారు. సీఐ వీ యుగంధర్ ఆధ్వర్యంలో ఎస్‌ఐ బీఆర్ ప్రసాద్, పోలీసులు పరీక్షా కేంద్రం వద్ద గట్టి బందోబస్తు నిర్వహించారు.

విద్యుత్ సబ్ స్టేషన్ ప్రారంభోత్సవం

బుక్కరాయసముద్రం: మండలంలోని జంతలూరు వద్ద విద్యుత్ సబ్ స్టేషన్‌ను శనివారం ఎమ్మెల్యే బండారు శ్రావణి ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ జంతలూరు వద్ద ఉన్న 33–11 కేవీ సబ్ స్టేషన్ నుంచి సెంట్రల్ యూనివర్శిటీ, జంతలూరు, చెదుల్ల, నీలాంపల్లి గ్రామాలకు విద్యుత్ సరఫరా అవుతుందన్నారు. కార్యక్రమంలో ట్రాన్స్‌కో ఎస్‌ఈ శేషాద్రి శేఖర్, ఈఈ జీవీ రమేష్, డీఈ రఘు, ఎంఅండ్‌పీ రవి శంకర్, ఏఈ ప్రతాప్‌కుమార్ పసుపుల శ్రీరామిరెడ్డి, తహసీల్దార్ పుణ్యవతి, ఎంపీడీఓ సాల్మాన్ తదితరులు పాల్గొన్నారు.

‘ప్రిన్సిపాల్‌పై చర్యలు తీసుకోండి’

గుత్తి: పట్టణంలోని ఏపీ రెసిడెన్షియల్ గురుకుల పాఠశాలలో ప్రభుత్వ సొమ్మును ప్రిన్సిపాల్ విజయలత దుర్వినియోగం చేస్తున్నారని, విచారించి చర్యలు తీసుకోవాలని సిటిజన్స్ రైట్స్ ప్రొటెక్షన్ కమిటీ అధ్యక్షుడు రమేష్ రెడ్డి డిమాండ్ చేశారు. ప్రిన్సిపాల్ తన గదిలో ఉన్నతాధికారులు అనుమతి లేకుండా ఏసీ ఏర్పాటు చేయించుకున్నారన్నారు. పైగా గత రెండేళ్లగా ఏసీ విద్యుత్ బిల్లులు ప్రభుత్వ సొమ్మును నుంచి కడుతున్నారన్నారు. ఈ విషయంపై సంబంధిత ఉన్నతాధికారులతో పాటు డీఈఓకు కూడా ఫిర్యాదు చేశామన్నారు. ఈ విషయంపై విచారణ చేయడానికి ఈ నెల 18న డీఈఓ వస్తున్నారన్నారు.

చాగల్లు డ్యాంలోకి చేప పిల్లలు..

పెద్దపప్పూరు: మండలంలోని చాగల్లు డ్యాంలో శనివారం ఎమ్మెల్యే జేసీ అస్మిత్‌రెడ్డి చేప పిల్లలను వదిలారు. మొత్తం 2.93 లక్షల చేప పిల్లలను డ్యాంలోకి విడుదల చేశామని అధికారులు తెలిపారు. కార్యక్రమానికి వివిధ శాఖల అధికారులు, సిబ్బంది హాజరయ్యారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

శింగనమల: శింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ నియోజకవర్గంలోని లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిధి కింద 19 మందికి రూ.27,12,600 విలవు చేసే చెక్కులను పంపిణీ చేశారు. శనివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో లబ్ధిదారులకు చెక్కులు అందజేశారు.

యువకుడి ఆత్మహత్య

యల్లనూరు: మండలంలోని వెన్నపూసపల్లిలో యానాది వెంకటేష్ (29) అనే వ్యక్తి కడుపునొప్పి తాళలేక శనివారం పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. అతడికి భార్య ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని హెడ్‌కానిస్టేబుల్ శంకర్‌నారాయణ తెలిపారు.

సపోటా చెట్లకు నిప్పు

తాడిపత్రి: మండలంలోని చుక్కలూరు వద్ద గుర్తుతెలియని వ్యక్తులు శనివారం సాయంత్రం గట్టుకు నిప్పు పెట్టడంతో తోటకు వ్యాపించి రైతు విష్ణువర్ధన్‌కి చెందిన 15 సపోటా చెట్లు దగ్ధమయ్యాయి. బాధిత రైతు సమాచారం మేరకు ఫైరింజన్ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను ఆర్పివేశారు.